# చక్రవాకం

తంజావూరు మన్నారుగుడి వసంతోద్యానంలో విహరిస్తోంది వయ్యారి భామ, సంగీత సాహిత్య సరస్వతి, సౌందర్య రాశి. కొమ్మ కొమ్మనున్న పువ్వును పలుకరించింది. కోయిలమ్మ గొంతుతో గొంతు కల్పింది. పిల్లతెమ్మెర సందడికి పమిట కొంగు విలాసంగా కదులుతోంది. తను రచించిన శృంగార పదాన్ని మళ్ళీమళ్ళీ మధురంగా ఆలపిస్తూ, అలా అలా వసంతోద్యానమంతా - విహరించి, ఉద్యాన సరసు చెంగట ఆగిపోయింది. రంగాజమ్మ.

"ఈ సరోవరానికి ఇంత నిశ్చలత ఏమిటో?! తన మానస సరోవరానికి అంత ఉద్వేగం ఏమిటో?! ఏమిటో మరి?" పాదాలు నీళ్లలో కదిలిస్తూ, గట్టున కూచుంది. అవి పాదాలా, పద్మాలా? ఎర్రని పాదాలు నీళ్లలో కదులుతుంటే, ఆ పాదాలపైని బంగారు మంజీరాలు గలగల సవ్వడి చేస్తుంటే రంగాజమ్మ నీళ్లలో తన ముఖం చూసుకుంది.

ఏమీ సౌందర్యం! ఆకర్ణాంత నయనాలు. నిగనిగలాడే చెక్కిళ్లు, నొక్కులనొక్కుల నల్లని జుట్లు, కొన తేరిన నాసిక అప్రయత్నంగా వాల్జడ ముందుకేసుకుంది రంగాజమ్మ. గలగలా నవ్వింది రంగాజమ్మ. ఆ నవ్వు నీటి అలలను తాకిందేమో అలలు గలగలా నవ్వుతో నవ్వు కలిపాయి. గాలి రివ్వును వీచింది. రంగాజమ్మ పమిట కొంగు నీళ్లలో తడిసింది. తనెవరు!

విజయరాఘవ మహీపాల నిత్యసంభా వితి! సంగీత నృత్య చూడామణి, శృంగార పదాలతో ప్రభువును పరవసింపజేసిన శృంగార రసాధిదేవత. తనకీ తక్కిన స్త్రీలకి పోలికా! తనని చూస్తే అసూయట.

"అమ్మా, అమ్మా!" ఇష్టసఖి రొప్పుతోంది. ముఖాన పట్టిన చెమట తుడుచుకుంది. "మీకోసమే... ప్రభువులు విజయపరంపరంతో విచ్చేశాక, గొప్ప సభ తీరుస్తున్నారట... మీ కోసం"

"ఏమిటీ"

"కబురు పంపారు"

రంగాజమ్మ చెక్కిళ్లు ఎర్రపడ్డాయి. విజయరాఘవ ఆస్థాన విదుషీమణి తను. ఈ రోజు ఎందుకో ఈ ప్రత్యేకమైన పిలుపు! మెరుపుతీగలా ఉద్యానవనం నుంచి

దాటి పోయింది.

ఇష్టసఖి అమ్మగారిని అలంకరించింది. ఎర్రని పట్టుచీర నిండా బంగారు చేమంతులు తళతళలాడుతున్నాయి. వజ్రాల పాపటిబిళ్ల వయ్యారంగా ముంగురులను ముద్దాడుతోంది. ముత్యాల రవిక ఎత్తైన వక్షోజాలపై బిగిసింది. నుదుట జాతి కస్తూరి తిలకం మెరుస్తోంది. నవరత్నాలహారం వక్షోజాలపై కదులుతోంది. నల్లని జడ పిరుదులు దాటి వయ్యారంగా ఊగుతోంది. ముత్యాల కమ్మలు, కెంపులు గాజులు, పంచరత్నాల ఉంగరం. ఇష్టసఖి కనురెప్ప వేయకుండా చూసింది. "ఏమిటీ సౌందర్యం!"

"ఊ" అంది కనుబొమ్మలెగరెస్తూ రంగాజమ్మ పైట పిన్నులోని వజ్రాలు తళుక్కుమంటుంటే.

"అమ్మా!"

"చెప్పూ"

"సాక్షాత్తు పట్టమహిషిలా వున్నారు"

రంగాజమ్మ ఆనందం పట్టపగ్గాలు లేకుండా పోయింది.

"అవును, పట్టమహిషినే" మంద గజగామినిలా ఇష్టసఖితో విజయరాఘవ మహీపాల సభాస్థలి చేరింది రంగాజమ్మ!

విజయరాఘవుని సభాప్రాంగణం కిటకిటలాడుతోంది. అప్పటికే ఆ సభలో కస్తూరి, అంబుజవల్లి వున్నారు. నాట్యాచారిణి సీతమ్మ వుంది. రూపరేఖా విలాసిని మదనరేఖ వుంది. మరెందరో ఎందరో సుందరాంగులు! రాజగురువు, తనకి తండ్రిలాంటి 'శతక్రతు శ్రీనివాస తాతాచార్యులు ప్రభువు పక్కన ఆసీనులై ఉన్నారు.

"రంగాజీ" విజయరాఘవుని పిలుపుకి ఒళ్ళంతా పులకాంకితురాలై, పరవశించిపోయింది రంగాజమ్మ. మన్నారుగుడిలోని రాజగోపాలస్వామిపై ప్రబంధం రాయాలట! ఫల్గుణోత్సవాన్ని వర్ణించాలట! శృంగార రసతరంగిత పదాలు రాసే తనే ఈ శృంగార ప్రబంధం రాయాలట.

"రంగాజీ!"

"నీ వాగామృతధారా ప్రవాహంలో పొంగిపొర్లేట్టుగా నా కథనే రాయి" విజయరాఘవుని కడగంటి చూపులు రంగాజమ్మ శరీరమంతా స్పృశిస్తున్నాయి.

"రంగాజీ"!

అది పిలుపా! అమృతపు చినుకా! మకరందపు పలుకా! అవును మహీ భర్త ప్రభువు తనకి. అతని కోర్కెమేరకు శృంగార ప్రబంధం రాస్తుంది తను. రంగాజమ్మ కళ్ళలో ఆనందబాష్పాలు. "నీ పతి మన్నారు దాసుడు" అంటున్నాడు రాజగురువు. రంగాజమ్మ లేచి విజయరాఘవుని నుండి బంగారుపళ్లెంలో వివిధాభరణాలు, పట్టువస్త్రాలు, తాంబూలం స్వీకరించింది. శతక్రతు శ్రీనివాసతాతాచారిగారి పాదాలకు ప్రణమిల్లింది.

సభ ముగిసింది! రంగాజమ్మ మన్నారు దాస విలాస ప్రబంధం ఆ క్షణమే ప్రాణం పోసుకుంది.

ఉదయ సంధ్యాకాంతుల్లో రంగాజమ్మ ఆనాటి సభను తల్చుకుని మురిసిపోతోంది. విజయరాఘవుడు తనకు చేసిన సన్మానం ఏ స్త్రీకి లభిస్తుంది? తన ప్రభువు, తన దైవం ఆ విజయరాఘవుడే! ఆ విజయరాఘవుని, కనుపాపల్లో తన బింబం కదలుతుంటే చాలదా తన జన్మ ధన్యమవటానికి. ఆ విజయరాఘవు కౌగిలిలో బందీనైతే చాలదా తన జన్మ పండటానికీ. చేతులకున్న కెంపుల కంకణం చూసుకుంది రంగాజమ్మ. ఈ ప్రతి కెంపులోనూ నా రాజు రూపం చూడలేనా! అప్రయత్నంగా ఆ కెంపుల కంకణం కళ్లకద్దుకుంది. "ఈ మధురానుభూతినుండి నన్నెన్నడూ దూరం చేయకు స్వామీ!" అంటూ మన్నారుదేవునికి నమస్కరించుకుంది.

ఎన్నెన్ని శృంగారపదాలతో తను రాజును ఆనందపరచలేదు కనక... ఎన్నిన్ని వెన్నెల రాత్రులు ఆరాజు ఒడిలో క్షణాలుగా గడపలేదు కనక... ఈనాడు శృంగార కావ్యం రాయాలా... రాస్తాను... ఒక యవ్వనవతిని నాయికగా చేస్తాను. ఫల్గుణోత్సవానికొచ్చిన విజయరాఘవునిపై మరులుగొన్నట్లు చేస్తాను. ఆ తర్వాత రంగాజమ్మ పెదాలపై చిరునవ్వు. విరహాలు, మన్మధతాపాలు, శీత లోపచారాలు, రాయబారాలు, వివాహం - రెండు శరీరాలు, మనసులూ ఏకమైన మధురక్షణం. రాస్తాను మన్నారుదాస విలాస ప్రబంధం! విజయరాఘవుడు, నేను చరిత్ర పుటల్లో శాశ్వతంగా వుండేట్టు రాస్తాను. నేనెవర్ని?! విజయరాఘవ మహీపాల నిత్యసంభావితని. అష్ట భాషాకవితా విశారదని. నాతో సాటికి రాగల మరో స్త్రీ వుందా?, రంగాజమ్మ ద్వారం ముందు ఎవరిదో కదలిక.

వాల్జడ ముందుకేసుకుని "ఎవరూ" అంది.

ఇష్టసఖి కంగారుగా వచ్చి నిలబడింది.

కథా నిలయం శ్రీకాకుళం

"అమ్మా, ప్రభువులు"

"రమ్మన్నారా" వాల్జడ వయ్యారంగా చేత బట్టుకుంది రంగాజమ్మ.

"కాదమ్మా"

"రమ్మనలేదా" రంగాజమ్మ కనుబొమలు ముడిపడ్డాయి.

"వస్తున్నారమ్మా!"

ప్రభువు వస్తున్నారా! నా భవనానికి... నా భవనానికి"

రంగాజమ్మని స్వేదం, రోమాంచం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పాదాలు తడబడుతున్నాయి.

"నా ప్రభువు, నా స్వామి, వస్తున్నారా" రంగాజమ్మ వేగంగా భవనంలోని తన శయ్యాగారానికి వెళ్ళిపోయింది. ఇష్టసఖి పెదాలపై చిరునవ్వు కదలి మాయమైంది.

తంజావూరు విజయరాఘవుడు రంగాజమ్మ శయనాగారంలో అడుగుపెట్టాడు. ఆ శుభసమయం రంగాజమ్మ జీవితంలో వసంతోత్సవాలు పండించింది. ఆ శుభసమయంలో రంగాజమ్మ కౌగిట్లోనే కాదు, కనుపాపల్లో బందీ అయ్యాడు విజయరాఘవ భూపాలుడు.

"రంగాజీ, ఒక్క మాట చెప్పు" విజయరాఘవుని చేతులు రంగాజమ్మ నడుముపై కదులుతున్నాయి.

"స్వామీ"

"ఆ శృంగార ప్రబంధంలో నాయిక కాంతిమతి ఎవరు" రంగాజమ్మ కిలకిలా నవ్వింది. తెల్లని పలువరస తళుక్కున మెరిసింది.

"ఈ కాంతిమతే"

"అవునా... నా ఊహ నిజమే" ప్రభువు రంగాజీ చెక్కిళ్ళు నిమురుతుంటే,

"ప్రభూ" అంది. విజయరాఘవుని చేతికున్న కెంపుల, కంకణం రంగాజీ వజ్రాల పైటపిన్నుని పట్టుకుంది. శయనాగారం కలకల నవ్వులతో ప్రతిధ్వనించింది.

"నన్నొదిలి ఎక్కడికీ వెళ్ళనని వాగ్దానం చేయండి ప్రభూ!" విజయరాఘవుని కౌగిలిలో ఒదిగిపోయింది రంగాజమ్మ. "నువ్వే నా సర్వస్వం, నా ప్రాణం. ఆ రాజ్యం, ఆ సభాభవనం ఏవీ నాకొద్దు. నువ్వే నేను, నేనే నువ్వు. రంగాజీ! నీ సాంగత్యం వదలిపోతానా?!"

"ఆ కాంతిమతి విరహంలాంటి విరహం నేను భరించలేను ప్రభూ" రంగాజమ్మ గొంతు గద్గదికమైంది. "నేను మన్నారు దేవుణ్ణి, నువ్వు మన్నారు దేవివి" విజయరాఘవ కనుపాపల్లో తన రూపం చూసి మురిసిపోయింది రంగాజమ్మ. ఎన్ని పగళ్లు, ఎన్ని

రాత్రుళ్లు, ఎన్ని వారాలు, నెలలు... ఎవరు చెప్పారూ! రంగాజమ్మ కౌగిలిలో బందీ తంజావూరు ప్రభువు.

అంతఃపుర గవాక్షంలో ప్రభువు రాకకై ఎదురు చూసి చూసి అలసిపోయిన నల్లని కళ్లని ఎవరు గుర్తిస్తారూ! రాజ వ్యవహారాలు స్తంభించిపోయిన స్థితికి దుఃఖించే పట్టమహిషి ఆవేదన ఎవరిని కదిలిస్తుందీ!

"అమ్మా, నే వెడతాను, మీరు కాదు, ఆ శృంగార పదాలు పాడుకొనే దానింటి గడపలో తమరు పాదం పెట్టడమా! వద్దు" పట్టమహిషి దూతిక రాజ అంతఃపురం దాటి వచ్చింది.

రంగాజమ్మ భవనం వైభవోపేతంగా వెలిగిపోతోంది. శయనాగార సుగంధద్రవ్యాల పరిమళాలు భవనమంతా వ్యాపించాయి. వసంతుడు ఇక్కడే నెలవైనట్లు పూల అలంకరణతో నేత్రపర్వంగా వుంది భవనం.

తూగుటుయ్యాలలో శృంగారపదాలు పరవశింప ఆలపిస్తూ ఊగుతోంది రంగాజమ్మ.

పట్టమహిషినుంచి వచ్చిన దూతిక రంగాజమ్మను సమీపించింది. "ఏమిటీ, పట్టమహిషిగారు కృంగి కృశించిపోతున్నారా? నేనేం చేయాలి. ఆనాడు నాకు కనకాభిషేకం చేసినప్పుడే ఎందరి గుండెల్లో చిచ్చురేగిందో నాకు తెలుసు. అది విజయరాఘవుడు నా ప్రభువు నాకు చేసిన ప్రేమాభిషేకం. ఊ, ఇంకేముంటుంది మీ దేవేరిగారు, ధర్మపత్నిగారు" రంగాజమ్మ తూగుటుయ్యాలలోనించి దిగింది.

"పతిభిక్ష పెట్టాలా" ఫక్కున నవ్వింది రంగాజమ్మ. దూతిక భయపడిపోయింది. "ఏం మీ దేవేరి ఆడది కాదా, భర్తని వలపించడం రాదా? నా మీద అసూయపడితే నేనేం చేస్తానూ. ఆ ధర్మపత్ని కౌగిటవుండగా నేను మీ విజయ రాఘవుణ్ణి లాక్కొచ్చానా?" రంగాజమ్మ విరగబడి నవ్వింది. దూతిక వణకిపోతోంది.

"ఈ చిత్రపటం నా భవనంలో ఉండిపోవాలా? నన్ను ఎంతకాలం భోగపత్ని అంటారింకా? నేను ప్రేమించే, పూజించే నా స్వామిని వదులుకోవాలా? పో, నీ దేవేరికి చెప్పు... ఈ రంగాజమ్మ విజయరాఘవ మహీపాల నిత్యసంభావిత అని. పో, నేనూ ధర్మపత్నినే అని చెప్పు. భర్తని ప్రేమించటం, వలపించటం రాని ఆమె ధర్మపత్ని, నేను భోగపత్నినా? బాగుంది. కాలం చెప్తుంది ఏమిటో వెళ్లు! ఇంకా నిలబడ్డావేం" రంగాజమ్మ ఆవేశంగా అంటోంది. రంగాజమ్మ ఊయలలో గొంతు

ఖంగుమంది.

రంగాజమ్మ ఊయల ఊగుతోంది.

క్షణం నిశ్శబ్దం... రంగాజమ్మ ఇష్టసఖి ఊపిరి పీల్చుకుంది. "హమ్మయ్యా పీడ విరగడైంది. మా అమ్మగారి ఆనందమే మా ఆనందం" కూనిరాగం తీస్తూ తూగుటుయ్యాల దగ్గర కొచ్చింది.

"అమ్మా, అమ్మా" చాలా ఉత్సాహంగా సమీపించింది ఇష్టసఖి.

"ఎందుకా ఆనందం" రంగాజమ్మ విరగబడి నవ్వింది.

"భలే సమాధానం చెప్పి పంపారు. పెద్ద గొప్ప... తనే దూతిక అన్న రీతిలో వచ్చింది. ఏడుపు మొహంతో పోయింది. అమ్మా! ఇందాకా అలా గాలికి పడకటింటి తెర కదిలితే ఇలా తొంగిచూశా. మన్మథుడమ్మా పడకపై" ఇష్టసఖి ముసిముసిగా నవ్వుతూ అంది.

"మన్మధుడికి శరీరము లేదుగా. ఎవరను కున్నావ్? విజయరాఘవ ప్రభువు, నా స్వామి" రంగాజమ్మ పరవశంతో కళ్లు మూసుకుంది. ఇష్టసఖి పారిపోయింది. మా అమ్మగారి ఆనందమే మా ఆనందం అనుకుంటూ.

కాలం గడుస్తోంది.

ఉదయ సంధ్యారాగం పిల్లతెమ్మెరతో కలిసి రంగాజమ్మ శయనాగారంలోకి తొంగిచూస్తుంటే రంగాజమ్మ బద్ధకంగా ఒళ్లు విరుచుకు నిద్రలేచింది.

శయనాగారం నుండి బయటకొచ్చింది. భవన సోపానాలు కాంతితో మెరుస్తున్నాయి. నిలబడి ప్రకృతి శోభను తిలకిస్తోంది. ఏమిటీ, కళ్లను నమ్మలేకపోతోంది ఆ క్షణంలో.

రాజ గురువులా! తన భవనానికి! తన జన్మ ధన్యమైపోయిందిగా!! శతక్రతు శ్రీనివాసతాతా చార్యులు పాదాలకు శిరసువంచి నమస్కరించింది రంగాజమ్మ.

రాజగురువు కళ్లలో నిప్పులు కురుస్తున్నాయి. రాజగురువు మకరకుండలాలు ఆ ఉదయ సంధ్యాకాంతిలో భయపెట్టేలా మెరుస్తున్నాయి. ఒక్కక్షణం రంగాజమ్మ కళ్లలోకి తీక్షణంగా చూసి మరుక్షణం కదిలిపోయాడు రాజగురువు. రంగాజమ్మ అవాక్కయిపోయి, ఆ సోపానాలమీద కూలబడిపోయింది.

శయనాగార గవాక్షంలోంచి ఉదయ సంధ్యాకాంతుల్ని పరవశించి చూస్తున్న

విజయరాఘవుడు క్షణం విస్తుపోయాడు. రాజ గురువు ఎందుకొచ్చినట్టూ. ఎందుకెళ్ళిపోతున్నట్టూ? విజయరాఘవుని కనుబొమలు ముడిపడ్డాయి.

తనకి రాజధర్మం గుర్తుచేయడానికా! తను రాజధర్మచ్యుతుడయిపోయాడని చెప్పడానికా! రాజధర్మాన్ని విస్మరించిన తనను మళ్ళీ మేలుకొల్పడానికా! విజయరాఘవుడి కళ్లు తీక్షణమయ్యాయి. శిరస్సుపై నిలచిన పూలరేకులు జలజలా నేలరాలిపడ్డాయి. మరుక్షణంలో విజయరాఘవ మహీపాలుడు రంగాజీ శయనాగారాన్ని వదలి వెళ్లి పోయాడు!

మనసు బరువుగావున్న రంగాజమ్మ అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది. తన ప్రభువుతో మనసువిప్పి చెప్పుకోవాలని! శూన్యమైన శయనాగారం రంగాజమ్మ గుండె పట్లు కదిలించింది. ఏడీ తన ప్రభువు. ఏడీ తన స్వామి! తను విజయరాఘవ మహీపాల నిత్య సంభావిత కదూ!

రంగాజమ్మ కన్నీరు జాలువారింది. చెక్కిళ్ల పైనుండి వక్షోజాల వరకు పొంగిపోర్లింది కన్నీరు.

"స్వామీ నా అంతఃపురం వీడిపోయినా మీ గుండె కదలికల్లో నేను లేనా, ప్రభూ! నా కనుచూపునుండి దూరమైనా మీ కనుపాపల్లో నా రూపం లేదా! నిజం చెప్పండి మీ రెక్కడున్నారో నేనక్కడేవున్నా"

వీణపై రంగాజమ్మ చేతివేళ్లు కదులుతున్నాయి. రంగాజమ్మ ఆలపిస్తున్న 'చక్రవాక' రాగం ఆ భవనమంతా కదలాడుతోనేవుంది. చక్రవాకరాగం రంగాజమ్మ గుండె గొంతులోంచి సన్నగా జాలువారుతూనే వుంది.

98 విపుల డిసెంబర్ 2003